




అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -109 శుక్రవారం 2 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# ఎల్ నినో కరువు పై కేంద్రానికి నివేదిక



## రెండు డీఏలు మంజూరు

- ఏడాదికి రెండున్నర వేలకోట్ల అదనపు భారం
- ఒక డీఏ రాబోయే జీతాలతో కలిపి పంపిణీ
- తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- ఎల్?నినో పరిస్థితులపై భేటీలో సుదీర్ఘ చర్చ
- కరవు పరిస్థితులపై చర్యలకు సమాలోచనలు
- ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లపై పలు సూచనలు
- ప్రాజెక్టులపై పునస్సమీక్షించాలని నిర్ణయం
- 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టుల నిలిపివేత
- డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు న్యూ పాలసీ

**హైదారాబాద్, అక్టోబర్ 1: (జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకులతో ఇటీవల జరిపిన చర్చల అనంతరం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు.. రాష్ట్రంలో ఉద్యోగులకు, పింఛనుదారులకు నిలిచిపోయిన పెండింగ్ కరువు భత్యాల్లో రెండు విడతల డీఏల విడుదలకు కేబినెట్ అధికారిక ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రిటైర్డ్ పెన్షనర్లకు వేతనాల పరంగా పెద్ద ఊరట లభించనుంది.కేబినెట్ నిర్ణయాల ప్రకారం..**మిగతా 2లో...**






## ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్ ఆపండి..

హైకోర్టుకు విజయారెడ్డి..

- విచారణ వాయిదా
- దానం నాగేందర్ ఎన్నికపై వేసిన పాత పిటిషన్ పెండింగ్‌లో ఉందని వాదన
- విచారణను మంగళవారానికి వాయిదా వేసిన న్యాయస్థానం
- కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశం

**హైదారాబాద్, అక్టోబర్ 1: (జర్నలిస్ట్ వార్త)**
ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. దివంగత మాజీ మంత్రి పి. జనార్దన్ రెడ్డి కుమార్తె**మిగతా 2లో...**

## 'సర్'లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు

: తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్

- 65 లక్షల మంది నోటీసులకు సమాధానం ఇచ్చారని వెల్లడి
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామన్న సుదర్శన్ రెడ్డి
- సర్ ప్రక్రియను పొడిగించే ఉద్దేశం లేదని




2లో.

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

- తప్పు తేలితే శిక్షకు సిద్ధం.. నువ్వు సిద్ధమా..!?
- సిఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి సిద్ధమా?
- రేవంత్ ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

**హైదారాబాద్, అక్టోబర్ 1(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి**మిగతా 2లో...**




## నిజమైన హీరో

- శరీరం నిండా కత్తిపోట్లు -శరీరం చిద్రమైనా డ్యూటీ మరిచిపోలేదు
- అంటూ ట్రంప్ ప్రశంస -గర్వకారణమన్న ప్రధాని మోదీ
- పైలట్ సాహసాన్ని కొనియాడిన నెతన్యాహు
- మచ్చరు విజయవంతంగా శస్త్రచికిత్స ప్రాణాలకు ప్రమాదం లేదు




2లో.

# బీసీరిజర్వేషన్లు జీవోల రద్దు



## ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు.

**ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశం**

- మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని హైకోర్టు స్పష్టీకరణ
- వార్డుల పునర్విభజన, ఇతర అంశాలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం




**అమరావతిఅక్టోబర్ 1:(జర్నలిస్ట్ వార్త)**
ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది.
ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది.
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు **మిగతా 2లో...**

# లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

**యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ**




- నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ

**న్యూఢిల్లీ,అక్టోబర్ 1(జర్నలిస్ట్ వార్త)**
యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ**మిగతా 2లో...**

# నిజమైన హీరో

**న్యూఢిల్లీ,అక్టోబర్ 1: (జర్నలిస్ట్ వార్త)**
విమానం వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తోంది. ఒక్కసారిగా కాక్‌పిట్‌లో ఊహించని ఉద్రిక్తత. సహచర పైలట్ దాడిలో తీవ్రంగా గాయపడిన కెప్టెన్. బయట 174 మంది ప్రయాణికులు. క్షణం ఆలస్యం జరిగినా పెను విషాదం తప్పకపోయేది. అలాంటి అత్యంత ప్రమాదకర పరిస్థితిలో గాయాలను లెక్కచేయకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు.

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ 1073 విమానంలో సెప్టెంబర్ 30న ఈ ఘటన చోటుచేసుకుంది. విమానంలో 174 మంది ప్రయాణికులు ఉన్నారు. కాక్‌పిట్‌లో సహ పైలట్‌తో జరిగిన ఘర్షణలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ తీవ్రంగా గాయపడ్డారు. విమానాన్ని ప్రమాదంలోకి నెట్టే ప్రయత్నం జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో అత్యవసర పరిస్థితి ఏర్పడింది.

### గాయాల మధ్య కీలక నిర్ణయం

దాడిలో తీవ్రంగా గాయపడినప్పటికీ కెప్టెన్ మచ్చర్ కాక్‌పిట్ తలుపును తెరవగలిగారు. దీంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి చేరుకుని దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడానికి అవకాశం ఏర్పడింది. విమానంలో ఉన్న మరో ఇద్దరు ఫ్లైదుబాయ్ పైలట్లు అనంతరం విమానాన్ని సురక్షితంగా సౌదీ అరేబియాలోని టబుక్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు.

సౌదీ అరేబియాలోని ఆసుపత్రిలో మచ్చర్‌కు చికిత్స అందించారు. భారత దౌత్య అధికారులు ఆయన పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. తాజా నివేదికల ప్రకారం ఆయన పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు సమాచారం.



### "స్మిత్ మచ్చర్ ఓ హీరో" ప్రధాని మోదీ

భారత ప్రధాని నరేంద్ర మోదీ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యాన్ని ప్రశంసిస్తూ ఆయనను "హీరో"గా అభివర్ణించారు.

తీవ్రమైన ప్రమాదాన్ని ఎదుర్కొంటూ, గాయపడినప్పటికీ ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు మచ్చర్ చూపిన ధైర్యం, సంకల్పం అభినందనీయమని మోదీ పేర్కొన్నారు. ఆయన చర్యలు వందలాది ప్రాణాలను కాపాడటంలో కీలకంగా నిలిచాయని తెలిపారు.

మోదీ స్మిత్ మచ్చర్ భార్య, తల్లిదండ్రులతోనూ మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయాలను అందిస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

### "దేశం గర్విస్తోంది" రాష్ట్రపతి ముర్ము

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యాన్ని ప్రశంసించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ ఇతరుల రక్షణ కోసం ఆయన చూపిన ధైర్యం, అద్భుతమైన సమయస్ఫూర్తి తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. స్మిత్ మచ్చర్‌పై దేశం గర్విస్తోందని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### ట్రంప్ కూడా ప్రశంసలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ ఘటనపై స్పందిస్తూ కెప్టెన్ మచ్చర్‌ను "హీరో"గా అభివర్ణించినట్లు అంతర్జాతీయ మీడియా నివేదించింది. తీవ్ర గాయాల మధ్య ఆయన వ్యవహరించిన తీరును ట్రంప్ ప్రశంసించారు.

### ప్రాణాల కంటే విధి గొప్పదన్న సందేశం

కాక్‌పిట్‌లో జరిగిన ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. సహ పైలట్‌పై విమానాన్ని ప్రమాదంలోకి నెట్టేందుకు ప్రయత్నించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఘటనకు దారితీసిన పూర్తి కారణాలు, ఉద్దేశం దర్యాప్తు పూర్తయిన తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది.

అయితే అత్యవసర పరిస్థితిలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రదర్శించిన ధైర్యం, సమయస్ఫూర్తి మాత్రం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గాయాల మధ్య కాక్‌పిట్ తలుపు తెరవడం ద్వారా ఇతరులకు లోపలికి ప్రవేశించే అవకాశం కల్పించడం, అనంతరం విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడంలో సహకరించడం వంటి చర్యలను పలువురు నేతలు ప్రశంసించారు.

ఒక పైలట్ ధైర్యం.. 174 మంది ప్రయాణికులకు భరోసాగా మారింది.ఒక క్షణం సమయస్ఫూర్తి.. ఒక పెను విషాదాన్ని తప్పించింది.అందుకే ప్రపంచ నేతల ప్రశంసలు అందుకుంటున్న కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఇప్పుడు భారత విమానయాన రంగంలో చర్చనీయాంశంగా నిలిచారు.

# లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

**మొదటిపేజీ తరువాయి**

ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు.యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి.

సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

# మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

**మొదటిపేజీ తరువాయి**

శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.మరోవైపు రేవంత్ రెడ్డికి ఒక గొప్ప చరిత్ర ఉంది.. ఆయన ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్ అయితదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తెలంగాణలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు.. తెలంగాణలో తెలుగు దేశంను మొత్తం ఆ పార్టీనే లేకుండా చేసి అడుగు నాశనం చేసి పోయిండు. అక్కడికెళ్లి ఇయ్యాళ్ల కాంగ్రెస్‌లకు వచ్చిండు. దీన్ని కూడా కచ్చితంగా మళ్లీ ఒక 25-30 ఏండ్లు ఎవడూ ఓటేయకుండా చేసే పోతడు. కాంగ్రెస్ మరిపించి.. మొత్తం నాశనం చేసే పోతడన్నారు కేటీఆర్ . నేతన్నకు బీమా అనే పథకం పెట్టినం. ఎవరన్నా నేత కార్మికుడు చనిపోతే రూ.6 లక్షలు రైతు బీమాలాగే పెట్టినం. మేమంతా కలిసి చేసినం. దాని గురించి ఏమైనా చెప్తడేమో చూసినం. ఆగిపోయింది మళ్లీ షురూ చేస్తా అని చెప్తడేమో అనుకున్నం.. దాని గురించి మాట లేదని కేటీఆర్ అన్నారు. బతుకమ్మ చీరలు బంద్ అయినయ్. అవి మళ్లీ అక్కడ పెడ్తడేమో చెప్తడేమో అనుకున్నం. దాని గురించి ముచ్చట లేదు. అక్కడ నీళ్లిచ్చే పథకం బంద్ అయింది.. దాని గురించి ఏమైనా చెప్తడేమో అనుకున్నం. ఏం లేదు.. మళ్లీ గదే పుక్కిటి పురాణం. ఇక్కడ చేసిన కథలే అక్కడ కూడా చేయడం. ఈ పాటి అందానికి అక్కడికి పోయి మీటింగ్ పెట్టాల్నా అని చురకలంటించారు. అదేదో ఇక్కడనే మైక్ ముందు ఒర్లితే అయిపోతుండేనన్నారు. రేవంత్ రెడ్డి అక్కడికిపోయి ఏదో దండయాత్రకు పోయినట్టు.. ఒక ముఖ్యమంత్రి, ఒక పీసీసీ ప్రెసిడెంట్, ఆరుగురు మంత్రులు, 30 మంది ఎమ్మెల్యేలు.. ఏదో శత్రు దేశం మీద దండయాత్రకు పోయినట్టు పోయారు.. మళ్లీ పేరేమో నల్లమల పులి.. ఎక్కడన్నా నల్లమల పులి 4000 పోలీసులను పెట్టుకోని పోతడా.. అంతమందిని కాపాలా పెట్టుకోని పోయిటోడివి.. నువ్వు పులివా.. నువ్వు నల్లమల పులివి కాదు.. చంద్రబాబు దగ్గర పిల్లి నువ్వు.. అని చురకలంటించారు.

# బీసీ రిజర్వేషన్లు జీవోల రద్దు

**మొదటిపేజీ తరువాయి**

కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది.అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది.మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.

# 'సర్'లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు

**హైదరాబాద్ అక్టోబర్ 1: (జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది నోటీసులపై స్పందించినట్లు చెప్పారు.నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్‌ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

# ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్ ఆపండి..

విజయారెడ్డి ఈ మేరకు ఉన్నత న్యాయస్థానంలో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.

విజయారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, 2024 ఎన్నికల్లో దానం నాగేందర్ విజయాన్ని సవాల్ చేస్తూ తమ క్లయింట్ దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్ ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. ఆ ఎన్నికల అఫిడవిట్‌లో దానం నాగేందర్ తప్పుడు సమాచారం ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ పాత పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయకుండా నిలిపివేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.

వాదనలు విన్న హైకోర్టు, ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. కోర్టు తాజా నిర్ణయంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రక్రియపై ప్రస్తుతానికి ఉత్కంఠ నెలకొంది.

# దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు

**శివుడు, శ్రీరాముడిని వేరు చేసి వ్యాఖ్యలా?**

**ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు -సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్**



**హైదరాబాద్, అక్టోబర్ 1: (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. "హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

# ఎల్ నినో కరువు పై కేంద్రానికి నివేదిక

**మొదటిపేజీ తరువాయి**

ఉద్యోగులకు 3.64 శాతం , 2.74 శాతం చొప్పున మొత్తం రెండు డీఏలను మంజూరు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా ఒక డీఏను త్వరలోనే రాబోయే జీతాలతో కలిపి పంపిణీ చేయనుండగా, మరో డీఏను రాబోయే పండుగలు, తదుపరి షెడ్యూల్ ప్రకారం విడుదల చేయనున్నారు. అంతేకాకుండా, ఉద్యోగులు , పెన్షనర్లకు సంబంధించిన సుమారు రూ. 10,000 కోట్ల పాత జిపిఎఫ్, గ్రాట్యుటీ, మెడికల్ బిల్లుల బకాయిలను ప్రతి నెలా క్రమం తప్పకుండా విడుదల చేస్తూ రాబోయే కాలంలో పూర్తిగా చెల్లించేలా బడ్జెట్ కేటాయింపులపై స్పష్టమైన కార్యాచరణకు అంగీకారం తెలిపింది. డీఏల విడుదలతో పాటు పే రివిజన్ కమిషన్ నివేదిక అమలుపై కూడా కేబినెట్ భేటీలో విస్తృతంగా చర్చించారు. పీఆర్సీ కమిటీ అందించే తుది నివేదికను పరిశీలించి, వీలైనంత త్వరగా కొత్త వేతన సవరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగ సంఘాల విన్నపాలను సానుకూలంగా పరిశీలించి ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం వెల్లడించింది. కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల అంశాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా సంస్కరణలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో ధరణి పోర్టల్ స్థానంలో తీసుకురానున్న కొత్త భూపరిపాలన వ్యవస్థ, నిషేధిత భూముల జాబితా సమీక్ష , రైతులకు సంబంధించిన పలు సంక్షేమ పథకాల అమలుపై సభలో చర్చ జరిగింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు సంబంధించి వివిధ నిధుల మంజూరుకు మంత్రివర్గం అమోదముద్ర వేసింది. గురువారం నాటి కేబినెట్ సమావేశం బహుళ ప్రాధాన్యత కలిగిన నిర్ణయాలతో ముగిసింది. దసరా, దీపావళి పండుగల వేళ విడుదలైన రెండు డీఏల నిర్ణయం ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ నిర్ణయానికి సంబంధించిన పూర్తి వివరాలు, చెల్లింపుల షెడ్యూల్ , అర్హతలతో కూడిన అధికారిక జీవోలు ఆర్థిక శాఖ ద్వారా త్వరలోనే వెలువడనున్నాయి. ఎల్ నినోను ఎదుర్కోవడంపై కేబినెట్ లో చర్చించారు. సబ్ కమిటీని నియమించనున్నారు. కేంద్రాన్ని సాయం అడగాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున కరవు మండలాలను ప్రకటించి తగిన సాయం అందించాలని కేంద్రాన్ని తెలంగాణ కేబినెట్ కోరింది. త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు దిల్లీకి మంత్రుల బృందం వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సుమారు 7,800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలను రాష్ట్ర మంత్రివర్గం మంజూరు చేసింది. తెలంగాణ డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ పాలసీని మంత్రివర్గం ఆమోదించింది. వివిధ కేటగిరీల్లోని భూముల క్రమబద్ధీకరణ కోసం కొత్తగా దరఖాస్తులు స్వీకరించేందుకు వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని నిర్ణయింది. రాష్ట్రంలో ఎల్?నినో పరిస్థితులపై కేబినెట్?లో సుదీర్ఘ చర్చ జరిగింది. రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరువు ప్రాంతాల్లో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీకి సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించారు. అఖిల పక్షంతో పాటు రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేసి ఉపశమన చర్యలపై సలహాలు సూచనలు స్వీకరించాలని సీఎం తెలిపారు. కరువు మండలాలు ప్రకటించడంతో పాటు.. రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి క్యాబినెట్ విజ్ఞప్తి చేసింది.ఎల్‌నినో పరిస్థితులతో గణనీయంగా పెరిగిన విద్యుత్తు వినియోగంపై కేబినెట్ చర్చించింది. రాష్ట్రంలో సాధారణంగా రోజుకు 15వేల మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండగా ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో 19 వేల 892 మెగావాట్ల డిమాండ్ కు చేరింది.ఈ నేపథ్యంలో డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి, సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎక్కడా కోతల్లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, అవసరమైన మేరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. భవిష్యత్తు డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. దాదాపు 7 వేల 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు ఆమోదం తెలిపింది. ఈ సీజన్‌లో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు, సిబ్బంది, మౌలిక వసతులను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# సామాజిక సేవలో మేము సైతం

## నిరుపేదలు, విద్యార్థులు, వరద బాధితులకు అండగా ఖమ్మం సిటీ 04 ఆర్గనైజేషన్





**ఖమ్మం/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** మానవ సేవే మాధవ సేవ అనే లక్ష్యంతో ఖమ్మం సిటీ 04 ఆర్గనైజేషన్ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. నిరుపేదలు, అనాథలు, విద్యార్థులు, మానసిక వికలాంగులు, వృద్ధులు, ప్రకృతి విపత్తుల బాధితులకు సంస్థ తరఫున వివిధ రకాల సేవలను అందిస్తున్నారు. పొన్నేకంటి ప్రేమ్‌కుమార్ 2009లో ఖమ్మం సిటీ 04 పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీని ప్రారంభించారు. హరిప్రియ, రోషిని, అనిల్, సుమంత్, సిద్ధార్థ, తేజ, చరిత, చిట్టీ, మహేష్ తదితరులు సంస్థలో భాగస్వాములుగా ఉంటూ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరిలో సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. ప్రస్తుతం సంస్థ ఇన్‌స్టాగ్రామ్ పేజీకి లక్షకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ప్రతి నెలా నిరుపేద విద్యార్థులకు నోటుపుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడంతో పాటు వృద్ధులకు అన్నదానం, రక్తదాన శిబిరాలు, అనాథలకు దుస్తులు, నిత్యావసర సరుకుల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజల పుట్టినరోజు వేడుకలను కూడా సేవా కార్యక్రమాలతో నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నారు.

గతంలో మున్నేరు వరదల సమయంలో సుమారు 500 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుస్తులు, వంట పాత్రలను అందించి బాధితులకు అండగా నిలిచారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పిల్లలకు విద్య ప్రాధాన్యతను వివరిస్తూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా పొన్నేకంటి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ తన ఎనిమిది మంది మిత్రులతో కలిసి ఖమ్మం సిటీ 04ను ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. స్వంత ఖర్చులతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. ఖమ్మం నగర ప్రజలకు తమ వంతు సహాయాన్ని అందిస్తూ సేవా రంగంలో మరింత ముందుకు సాగడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# కళాకారులపై నిర్లక్ష్యం ఎందుకు?

## సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాలు భర్తీ చేయాలి -రవీంద్రభారతి ముట్టడిలో హనుమకొండ కళాకారుల డిమాండ్





**హనుమకొండ/బ్యూరో అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేసి అర్హులైన నిజమైన కళాకారులకు అవకాశం కల్పించాలని హనుమకొండ జిల్లా కళాకారులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం గురువారం రవీంద్రభారతి ముట్టడి కార్యక్రమంలో జిల్లా కళాకారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వం ఇకనైనా కళాకారుల సమస్యలపై స్పందించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు ఇనుముల రవీందర్ మాట్లాడుతూ.. కళాకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేయొద్దన్నారు. సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి కళాకారులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీగా ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు కళాకారుల పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇనుముల రవీందర్, రామంచ రాజేందర్, బండారి సుధాకర్, గజాల గోవర్ధన్, పోచారం కృష్ణ, మైస సుధాకర్, మధుచారి, జోగు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లలో పెద్దల పెత్తనమా?

## ధర్మసాగర్‌లో అర్హుల ఎంపికపై అనుమానాలు -గ్రామసభలోనే జాబితా తేల్చాలని గ్రామస్తుల డిమాండ్

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఅక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ధర్మసాగర్‌లో అర్హులైన పేదలకు న్యాయం జరుగుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. లబ్ధిదారులను గ్రామసభ ద్వారా గుర్తించి, అర్హతలను పరిశీలించి జాబితా రూపొందించాల్సి ఉండగా.. ఎంపిక ప్రక్రియపై గ్రామంలో చర్చ మొదలైంది.

ప్రభుత్వం గ్రామస్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసినప్పటికీ.. వాటి పాత్ర నామమాత్రంగానే మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో గ్రామంలో రాజకీయంగా పలుకుబడి ఉన్న కొందరు తమకు అనుకూలమైన పేర్లను లబ్ధిదారుల జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు గ్రామస్తుల నుంచి వస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు.



### అర్హులకు అన్యాయం జరిగితే..?

ఇల్లు లేని నిరుపేదలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన కుటుంబాలను పక్కనపెట్టి ఇతరులకు ప్రయోజనం కల్పించే పరిస్థితి ఏర్పడితే పథకం అసలు లక్ష్యమే దెబ్బతింటుందని గ్రామస్తులు అంటున్నారు. అందుకే ప్రతి దరఖాస్తుదారుడి అర్హతను క్షేత్రస్థాయిలో పరిశీలించి, గ్రామసభలో జాబితాను బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

### కడియం శ్రీహరి దృష్టి సారించాలి

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ వ్యవహారంపై దృష్టి సారించి. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యానికి, అక్రమాలకు తావులేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. అర్హులైన పేదల పేర్లను పారదర్శకంగా ఎంపిక చేసి, అనర్హుల పేర్లు ఉంటే నిబంధనల ప్రకారం తొలగించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### గ్రామసభే గీటురాయి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించేందుకు గ్రామసభ నిర్వహించి ప్రజల సమక్షంలో అర్హతలను పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అర్హులైన ఒక్క కుటుంబానికి కూడా అన్యాయం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, పథకం రాజకీయాలకు అతీతంగా నిజమైన పేదలకు చేరేలా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# విజయ డైరీ విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

## పాడి రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రుణాలు, బీమా, రాయితీలు అందించాలి: కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** జిల్లాలో విజయ డైరీని విస్తరించడంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పశుసంవర్ధక, సహకార, బ్యాంకింగ్, పరిశ్రమల శాఖల అధికారులు, రైతులు, సర్పంచ్‌లతో ఆమె సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయ డైరీ విస్తరణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి గ్రామసభల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పాల దిగుబడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో విజయ డైరీ పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి, అవసరమైన రవాణా వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సహకార సంఘాల ద్వారా కొత్త పాల సొసైటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



పాడి రైతులకు బ్యాంకు రుణాలు, పశువులకు బీమా సౌకర్యం, నాణ్యమైన పశుదానా, క్యాల్షియం, మినరల్ మిశ్రమం, నట్టల నివారణ మందులు, పశుగ్రాస విత్తనాలను రాయితీపై అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల ద్వారా కొత్త పశువుల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

పాడి రైతుల ఆర్థిక పురోగతే లక్ష్యంగా విజయ డైరీ ద్వారా గిట్టుబాటు ధరతో పాటు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), హౌసింగ్ పీడీ పురుషోత్తం, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, విజయ డైరీ ఉప సంచాలకులు జి. ధన్‌రాజ్, జిల్లా సహకార శాఖ అధికారి, శ్రీమన్నారాయణరెడ్డి, యువ పాడి రైతులు, సర్పంచ్‌లు, బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గువ్వల రామిరెడ్డికి నాయకుల నివాళి



**తల్లాడ/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గువ్వల రామిరెడ్డి ఇటీవల మృతి చెందారు. గురువారం గ్రామంలో నిర్వహించిన ఆయన దశదినకర్మ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి తదితరులు రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకట లాల్, కాంగ్రెస్ నాయకులు పొన్నం కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్‌తో వినియోగదారులే యజమానులు

## పీఎం సూర్యఘర్ పథకంతో అదనపు ఆదాయం పొందొచ్చు




**స్టేషన్‌ఘన్‌పూర్/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** సోలార్ విద్యుత్ ఉత్పత్తితో వినియోగదారులే యజమానులుగా మారవచ్చని ఎన్పీడీసీఎల్ డీఈ బి.సారయ్య అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణంలోని ఎన్పీడీసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సేవా సేతు కార్యక్రమంలో భాగంగా గురువారం సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా గృహ వినియోగదారులు తమ ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని నెలకు 360 యూనిట్ల వరకు విద్యుత్ పొందవచ్చని డీఈ తెలిపారు. ఉత్పత్తి చేసిన విద్యుత్‌లో మిగులును సంస్థకు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ రాయితీతో పాటు బ్యాంకు రుణ సదుపాయాన్ని వినియోగించుకుని సొంత పెట్టుబడి భారం లేకుండా సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. మూడు కిలోవాట్ల సోలార్ వ్యవస్థకు ఎలాంటి జామీను లేకుండా బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. గృహ విద్యుత్ సర్వీసుతో పాటు సోలార్ ఏర్పాటుకు అనువైన సొంత రూఫ్‌టాప్ ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంతో విద్యుత్ ఆదా కావడంతో పాటు వాతావరణ కాలుష్యం తగ్గుతుందని వివరించారు. ఘనపూర్ ఏడీఈ పి.రణధీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్కో, బ్యాంకు అధికారులు, ఏఈలు రవీందర్, పి.శంకర్, శివకుమార్, శ్వేత, సబ్ ఇంజనీర్లు సాధన, హరిత, వినియోగదారులు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల సేవలు అభినందనీయం

## బదిలీపై వెళ్తున్న పోలీసు సిబ్బందికి సన్మానం



**తల్లాడ/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** పోలీసు శాఖలో 30 ఏళ్లుగా సేవలందించడం అభినందనీయమని ఎస్సై వెంకటకృష్ణ అన్నారు. తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న ఏఎస్ఐలు చెన్నారావు, పిచ్చయ్య, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లును బుధవారం రాత్రి సన్మానించారు. మండల నాయకులు, మీడియా ప్రతినిధులు శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ కుందూరు వెంకటరెడ్డికి ఎమ్మెల్యే నాగరాజు నివాళి

**హసన్‌పర్తి/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** డాక్టర్ కుందూరు వెంకటరెడ్డి మృతదేహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గురువారం నివాళులర్పించారు. సుబేదారి ఆఫీసర్స్ క్లబ్‌లో సభ్యుడిగా తనతో కలిసి టెన్నిస్ ఆడిన వెంకటరెడ్డి మృతి తీవ్రంగా బాధ కలిగించిందని అన్నారు. వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకటరెడ్డితో తనకు మంచి స్నేహం ఉందని, ఆయన మరణం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.



# ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావును పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హసన్‌పర్తి/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ భర్త, సీనియర్ రాజకీయ నాయకుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావును వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గురువారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన వరద రాజేశ్వర్‌రావు ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వరద రాజేశ్వర్‌రావు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఎమ్మెల్యే నాగరాజు ఆకాంక్షించారు. ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## క్రైస్తవులకు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

### పాస్టర్లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇవ్వాలి: బిషప్ సుదర్శనం




**తల్లాడ/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలోని క్రైస్తవులకు ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ ఎం. డేవిడ్ సుదర్శనం డిమాండ్ చేశారు. గురువారం తల్లాడలో నిర్వహించిన టీసీసీ మండల పాస్టర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో పాస్టర్లకు ఇస్తున్న విధంగా తెలంగాణలోనూ రూ.5 వేల గౌరవ వేతనం అందించాలని కోరారు.నిరుపేద క్రైస్తవులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు జిల్లా, మండల కేంద్రాల్లో క్రైస్తవుల కోసం స్మశాన వాటికలు, కళ్యాణ మండపాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చట్టాలను రూపొందించాలని కోరారు. అనంతరం బిషప్ సుదర్శనంను స్థానిక పాస్టర్లు శాలువాలతో సన్మానించారు.టీసీసీ జిల్లా గాస్పెల్ సింగర్ ఖమ్మంపాటి ఇశ్రాయేలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు గుంటి బాబురావు, రాష్ట్ర కార్యదర్శి నిరీక్షణ రావు, మీడియా అధ్యక్షులు నారపోగు ప్రసాద్, తల్లాడ మండల అధ్యక్షులు ఇనపనూరి ప్రకాష్ రావు, సంఘసాని దానియేలు, దేవ సహాయం, కృష్ణ, సులోమాను తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లయ్య గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



**కేసముద్రం/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ 1వ వార్డుకు చెందిన ఆకుల కిరణ్ గౌడ్ తండ్రి ఆకుల ఎల్లయ్య గౌడ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన పార్థివదేహాన్ని కేసముద్రం తీసుకురావడంతో బీఆర్ఎస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు జాటోత్ హరీష్ నాయక్, కౌన్సిలర్లు దూదేపాక కృష్ణ, ఆగే రాము, రావుల వినయ్ రెడ్డి తదితరులు ఎల్లయ్య గౌడ్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బానోత్ అశోక్, కేతిరి ఉప్పలయ్య, యాసారపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి 20 మంది బీఆర్ఎస్ నాయకులు



**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 01 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని అక్కపల్లిగూడెం గ్రామానికి చెందిన సుమారు 20 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎంపీ కడియం కావ్య కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు అందరం కలిసి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోషకాహారం ఆరోగ్యకరమైన కుటుంబానికి పునాది

### ..జిట్టెగూడెం గ్రామ సర్పంచ్ బానోతు బాలు



**స్టేషన్ ఘన్‌పూర్,అక్టోబర్ 01 (జర్నలిస్ట్ వార్త ) :**
పోషకాహారం ఆరోగ్యకరమైన కుటుంబానికి పునాది అని జిట్టెగూడెం గ్రామ సర్పంచ్ బానోతు బాలు అన్నారు. మండలంలోని జిట్టెగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో జిట్టెగూడెం, గాలి గుట్ట తండా అంగన్వాడి టీచర్ లు లునావత్ రంగమ్మ,లకావత్ ప్రణావతి ఆధ్వర్యంలో పోషణ్ మాసంపండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు బాలు మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని, అంగన్వాడి సెంటర్ ల ఆధ్వర్యంలో వంటకాలు తయారుచేసి తల్లులకు పిల్లలకు అందజేయాలని అన్నారు. అంగన్వాడి సేవలను తల్లులు,గర్భిణీలు, బాలింతలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలనిఅన్నారు.పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను ప్రతిరోజు తీసుకోవా లని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ లు లునావత్ రంగమ్మ,లకావత్ ప్రణావతి, ఉప సర్పంచ్ లునావత్ రజిత, గ్రామపంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, ఏఎన్ఎం ఎలీషా, ఆశా కార్యకర్త రామి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారు లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డుకు మోక్షమెప్పుడు?

### ఐదారేళ్లుగా అధ్వానమే.. పట్టించుకోని అధికారులు

### ప్రమాదకరంగా మారిన కల్వర్టులు, బ్రిడ్జి.. ప్రజాప్రతినిధులు స్పందించాలి

**భీమదేవరపల్లి/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
కొత్తకొండధర్మారంమల్లంపల్లి ప్రధాన రహదారి దుస్థితిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించాల్సిన సమయం ఆసన్నమైంది. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఈ రహదారి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. రహదారిపై అడుగడుగునా గుంతలు, తేలిన కంకరతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. ఐదారేళ్లుగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా శాశ్వత పరిష్కారం లేకపోవడంతో స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**ఎక్కడ చూసినా గుంతలే**

కొత్తకొండ గాంధీ విగ్రహం నుంచి మల్లంపల్లి వైపు వెళ్లే రహదారి దాదాపు పూర్తిగా దెబ్బతింది. నర్సరీ ప్రాంతంలో రహదారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వర్షం పడితే గుంతలు నీటితో నిండిపోవడంతో అవి కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లతో పాటు భారీ వాహనాలు సైతం ఈ మార్గంలో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



**కల్వర్టుల వద్ద ముప్పు**

స్మశానవాటిక సమీపంలోని కల్వర్టు వద్ద భారీ గుంత ఏర్పడింది. దూడల కనకయ్య బావి మూలమలుపు వద్ద కల్వర్టు పక్కన రోడ్డు కింద నుంచి మట్టి కొట్టుకుపోయి సుమారు ఒక గజం మేర గుల్లబారింది. లోడుతో వచ్చే ట్రాక్టర్లు, లారీలు ఈ ప్రాంతంలో ప్రయాణిస్తే రోడ్డు కుంగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బ్రిడ్జిపై తేలిన సలాకలు**

ధర్మారం రోడ్డులోని బ్రిడ్జి పరిస్థితి కూడా ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై సలాకలు బయటకు తేలి కనిపిస్తున్నాయి. బ్రిడ్జికి ఇరువైపులా నాణ్యత లేని ఇటుకల దిమ్మెలు ఏర్పాటు చేయడంతో వాహనదారులకు రక్షణ లేకుండా పోయింది. ఇప్పటికే సుమారు 7 నుంచి 8 కార్లు దిమ్మెలను ఢీకొని అదుపుతప్పిన



ఘటనలు చోటుచేసుకున్నాయని చెబుతున్నారు.

**ప్రజాప్రతినిధులు స్పందించాలి**

రహదారి దుస్థితిపై తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఐదారేళ్లుగా సమస్యను పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. తాత్కాలిక ప్యాచ్‌వర్క్‌లతో సరిపెట్టకుండా రహదారిని పూర్తిస్థాయిలో బాగుచేయాలని కోరారు. కల్వర్టులు, బ్రిడ్జికి పటిష్టమైన రక్షణ గోడలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, సంబంధిత ప్రజాప్రతినిధులు స్పందించి అధికారులతో సమీక్ష నిర్వహించి రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం



కంటే ముందుగానే చర్యలు తీసుకుని ప్రాణనష్టం జరగకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భూమిపూజ

### రాష్ట్రంలోనే మంచి పేరున్న విద్యాసంస్థగా తీర్చిదిద్దాలి: కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 01 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రాష్ట్రంలోనే మంచి పేరున్న విద్యాసంస్థగా తీర్చిదిద్దాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక ల్యాబొరేటరీలు, లైబ్రరీ, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాల ఆవరణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో కడియం శ్రీహరి పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి డిగ్రీ కళాశాలను మంజూరు చేయించుకున్నట్లు తెలిపారు. ఇది తన ఎన్నికల హామీ అని పేర్కొన్నారు. 2025 మార్చి 22న జారీ చేసిన జీవో ద్వారా కళాశాలకు



రూ.8.60 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇందులో రూ.6.10 కోట్లు భవన నిర్మాణానికి, సుమారు రూ.2.50 కోట్లు ఉద్యోగుల జీతాలు, ఇతర అవసరాలకు కేటాయించినట్లు వివరించారు. భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి 2027 ఆగస్టు 1 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

కళాశాల భవనంతో పాటు విద్యార్థులకు అవసరమైన ల్యాబొరేటరీలు, లైబ్రరీ, ఇతర సౌకర్యాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని అన్నారు. భవిష్యత్తులో ఘన్‌పూర్ డిగ్రీ కళాశాలకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు వచ్చేలా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్‌రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, ఈఈ అరుణ్, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# దిశా సమావేశంలో అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష

### రోడ్డు భద్రత, విద్య, చిన్నారుల రక్షణపై ప్రత్యేక దృష్టి

**హసన్‌పర్తి/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం జిల్లా సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, దిశా కమిటీ చైర్మన్ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమావేశంలో విస్తృతంగా సమీక్షించారు. గత మార్చి 7న జరిగిన దిశా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును పరిశీలించారు. పెండింగ్




పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు.రోడ్డు భద్రతపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ, రహదారి నిర్వహణపై శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.ముస్కాన్ ఆపరేషన్ ద్వారా చిన్నారుల రక్షణ, బాల కార్మికుల నిర్మూలన, తప్పిపోయిన పిల్లల గుర్తింపు, సంరక్షణ అంశాలపై కూడా చర్చించారు. పోలీస్, మహిళాశిశు సంక్షేమ, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు.

# ఏఐఎస్ఎఫ్‌కు 90 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర

### సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి -రెహమాన్, సంతోష్, ప్రణీత్‌గౌడ్‌లకు సిపిఐ ఘన సన్మానం

**హసన్‌పర్తి/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)కు 90 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉందని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నికైన రెహమాన్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్‌గౌడ్‌లను గురువారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నాయకులు ఘనంగా సన్మానించారు.

ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల సందర్భంగా ఇటీవల జరిగిన రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో నూతన బాధ్యతలు చేపట్టిన ముగ్గురికి సిపిఐ నాయకులు




శాలువాలు కప్పి, పూలబొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కర్రె బిక్షపతి మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ స్వాతంత్ర్యోద్యమంలో కీలక పోరాటాలు నిర్వహించిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వ విద్య పరిరక్షణ, శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం అమలు కోసం నిరంతరం పోరాటాలు సాగిస్తోందన్నారు.గల్లీ నుంచి ఢిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై, విద్యావ్యతిరేక విధానాలపై ఏఐఎస్ఎఫ్ అలుపెరుగని పోరాటాలు నిర్వహించి అనేక విజయాలు సాధించిందన్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన విద్యార్థి సంఘంలో పనిచేయడం గౌరవంగా భావించాలన్నారు. నూతనంగా ఎన్నికైన రెహమాన్, సంతోష్, ప్రణీత్‌గౌడ్‌లు రానున్న రోజుల్లో విద్యారంగ సమస్యల పరిష్కారానికి విస్తృతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.ఎ.స్టాలిన్, మునిగాల బిక్షపతి, కొట్టేపాక రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరానగర్‌లో గుడిసె లేకుండా చేస్తాం

## అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు -మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరానగర్‌లో ఒక్క గుడిసె కూడా ఉండకూడదని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి పక్కా ఇల్లు నిర్మించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ 10వ వార్డు ఇందిరానగర్‌లో రూ.5 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల వంటగదిని, 10, 18 వార్డుల్లో మున్సిపల్ నిధులు రూ.కోటితో నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరానగర్‌లో స్థానికుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రమాదాలకు కారణమవుతున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించడంతో పాటు అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు.

ఇందిరానగర్‌లో గతంలో ఏడు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఐదు ఇళ్ల నిర్మాణం పూర్తయిందని,





మిగిలిన అర్హులైన కుటుంబాలకు కూడా ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్, చాగల్లు, శివునిపల్లి గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరగా 2025 జనవరిలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సుమారు రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి మరో రూ.8 కోట్ల నిధులు వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ నీల రాజమ్మ, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, కమిషనర్ బి.రాధాకృష్ణ, కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఇండోర్ స్టేడియాన్ని అందుబాటులోకి తేవాలి

## ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కబడ్డీ అసోసియేషన్ వినతి

**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 01 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలోని శివునిపల్లి శివారు నమిలిగొండ రోడ్డులో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని మరమ్మతులు చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు.



ఈ మేరకు అసోసియేషన్ చైర్మన్ పోగుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య, సహాయ కార్యదర్శి అన్నెపు కుమార్ గురువారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. గత కొన్ని నెలలుగా స్టేడియం వినియోగంలో లేకపోవడంతో తలుపులు, కిటికీలు తదితర సామగ్రి దెబ్బతిని భవనం శిథిలావస్థకు చేరిందని తెలిపారు. స్టేడియాన్ని పూర్తిగా మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొస్తే నియోజకవర్గంలోని క్రీడాకారులకు సాధనకు అవకాశం కలుగుతుందని, జిల్లా, రాష్ట్రస్థాయి కోచింగ్ క్యాంపులు నిర్వహించవచ్చని పేర్కొన్నారు. తద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. వినతిపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి సానుకూలంగా స్పందించి త్వరలోనే ఇండోర్ స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

# మిర్యాలగూడలో ఘనంగా గురుపూజోత్సవం

### ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**మిర్యాలగూడ/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడెం ఎస్వీ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శుసింధర్‌రావు హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డి, ఎంఈవోలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే, జిల్లా అధికారులు శాలువాలు, జ్ఞాపికలు, అవార్డులతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యలో నాణ్యమైన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డు, షూస్,



సాక్స్, ట్రంక్ బాక్స్ తదితర వస్తువులతో కూడిన స్టూడెంట్ కిట్స్ అందిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం పెరగడంతో విద్యార్థుల ఏకాగ్రతను కాపాడటం ఉపాధ్యాయులకు సవాలుగా మారిందన్నారు. బోధనలో సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. 8, 9, 10వ తరగతుల నుంచే విద్యార్థులకు కాన్సెప్ట్‌లపై స్పష్టమైన అవగాహన కల్పించాలని, ఇంటర్మీడియట్‌లో డ్రాపౌట్స్‌ను తగ్గించేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. వెనుకబడిన విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ



విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మంజూరైన ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించి రెండేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గురువుల సేవలను గుర్తించి నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలు ఆత్మీయ వాతావరణంలో ఘనంగా ముగిశాయి.

# రోడ్లపై మట్టి తొలగించి భద్రతా చర్యలు చేపట్టాలి





**సత్తుపల్లి/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లిఖమ్మం ప్రధాన రహదారిపై సింగరేణి క్యాంపులు, భారీ వాహనాల రాకపోకలతో పేరుకుపోయిన మట్టి, దుమ్మును వెంటనే తొలగించి ప్రజల భద్రతకు చర్యలు చేపట్టాలని బీజేపీ సత్తుపల్లి మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ డిమాండ్ చేశారు. రోడ్డుపై మట్టి పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని, దుమ్ము కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాలని, హెచ్చరిక బోర్డులు, ప్రమాద సూచికలు, అవసరమైన చోట బ్యారికేడ్లు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు. దుమ్ము నియంత్రణకు క్రమం తప్పకుండా నీటిని పిచికారీ చేయడంతో పాటు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సింగరేణి యాజమాన్యం, సంబంధిత రోడ్డు, పోలీసు అధికారులు వెంటనే ప్రాంతాన్ని పరిశీలించి ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని సాలి శివకృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు చీకటి వసంతరావు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే రహంతుల్లా పాల్గొన్నారు.

# ఓయూలో ఎమ్మెస్ఎఫ్ జాతీయ సదస్సు

**కేసముద్రం/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 6న నిర్వహించనున్న ఎమ్మెస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు కొమ్ము నాగరాజ్ మాదిగ పిలుపునిచ్చారుకేసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన ఎమ్మెస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు పేద దళిత బీసీ విద్యార్థుల విద్యా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని కోరారు సదస్సుకు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారుసమావేశంలో ఎమ్మెస్ఎఫ్ నాయకులు కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు



# రక్షణ కందకాలు భద్రం 24 గంటల నిఘా.

## -బయ్యారం ఎఫ్ఆర్వో రవి కిరణ్.





**బయ్యారం/,అక్టోబర్ 1.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం గార్ల మండలాల సరిహద్దు ప్రాంతంలో గల సేరిపురం గ్రామ శివారులో నాగారం సమీపాన ఉన్న గార్ల సంరక్షిత అటవీ ప్రాంతంలో బరైట్స్ ఖనిజం అక్రమ తవ్వకాలు,రవాణా జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. అటవీ ప్రాంతంలోని 42, 43, 44 కంపార్ట్‌మెంట్లలో గురువారం రెవెన్యూ, అటవీ, గనుల శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. గార్ల తహసీల్దార్,రెవెన్యూ సిబ్బంది,బయ్యారం అటవీశాఖ రేంజ్ అధికారి రవి కిరణ్, సిబ్బంది,మహబూబాబాద్ గనుల శాఖ ఇన్‌స్పెక్టర్ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బరైట్స్ ఖనిజానికి సంబంధించి ఇటీవల ఎలాంటి అక్రమ తవ్వకాలు జరిగిన ఆనవాళ్లు కనిపించలేదని అధికారులు తెలిపారు. అటవీ ప్రాంతంలోని గని ప్రాంతం వెంబడి అటవీశాఖ ఏర్పాటు చేసిన రక్షణ కందకాలు (ట్రెంచ్‌లు) చెక్కుచెదరకుండా ఉన్నాయని అధికారులు గుర్తించారు. దీంతో వాహనాల ద్వారా ఖనిజాన్ని అక్రమంగా తవ్వడం,తరలించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. గ్రామస్థుల నుంచి వివరాల సేకరణతనిఖీల అనంతరం అధికారులు సమీప గ్రామస్థులను విచారించారు. ఈ ప్రాంతంలో ఎలాంటి బరైట్స్ అక్రమ తవ్వకాలు,రవాణా జరగలేదని వారు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. అటవీశాఖ సిబ్బంది,బేస్‌క్యాంప్ వాచర్లు 24 గంటలూ అటవీ ప్రాంతంపై నిఘా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. స్థానికుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా గార్ల సంరక్షిత అటవీ ప్రాంతం నుంచి బరైట్స్ అక్రమ క్వారీయింగ్, రవాణా జరగలేదని అధికారులు వెల్లడించారు.



# హాస్టల్‌ను తనిఖీ చేసిన డీఎస్‌సీడీవో ఎండీ. హమీద్

**వర్ధన్నపేట/ అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట ఎస్‌సీజీహెచ్ హాస్టల్‌ను డీఎస్‌సీడీవో ఎండీ. హమీద్ గురువారం సాయంత్రం 6.15 గంటలకు సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. వంటగది, నిల్వ గది, నివాస గదులు, విద్యార్థుల చదువుకునే సమయాలు, రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.



# భూక్యరాంతండాలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**కేసముద్రం/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మండలం మహమూద్‌పట్నం రెవెన్యూ పరిధిలోని భూక్యరాంతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ జాటోత్ సోమి, ఉపసర్పంచ్ లకావత్ కంద్య గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, నిత్యావసర సరుకులు అందించాలనే లక్ష్యంతో డిజిటలైజ్ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు స్వచ్ఛందంగా శ్రమదానం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇస్సంపల్లి నాగార్జున, రేషన్ డీలర్ రాంబాబు, వివిధ వార్డుల సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తల్లాడలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాగమయి పర్యటన

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

**తల్లాడ/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గురువారం పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**రామిరెడ్డికి నివాళి**

తల్లాడ పట్టణంలో నిర్వహించిన గువ్వల రామిరెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాగమయి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**కేశవరెడ్డి కుటుంబానికి పరామర్శ**

గొల్లగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన దుండేటి కేశవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.





**కాంగ్రెస్ నాయకుడు గోపిశెట్టి పరామర్శ**

అనారోగ్యంతో బాధపడుతున్న తల్లాడ మండల కాంగ్రెస్ నాయకుడు గోపిశెట్టి వెంకటేశ్వర్లును మంత్రి, ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమాల్లో మువ్వా విజయబాబు, తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, దున్నేటి వీరారెడ్డి, పొట్టేటి జనార్దన్‌రెడ్డి, జక్కంపూడి కిషోర్, కల్లూరు మున్సిపల్ చైర్మన్, మండల కమిటీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆకుల ఎల్లయ్య పార్థివదేహానికి నివాళులర్పించిన పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు

**కేసముద్రం/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** అనారోగ్యంతో మృతి చెందిన కేసముద్రం మున్సిపాలిటీ పరిధికి చెందిన ఆకుల ఎల్లయ్య పార్థివదేహానికి ధన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధన్నసరి మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, మూడో వార్డు కౌన్సిలర్ ధారావత్ కిషోర్, మాజీ సర్పంచ్ గంధసిరి వెంకన్న, తండా వెంకటేశ్వర్లు, తరాల సుధాకర్, పలుస నాగేష్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.



# గాంధీని స్మరించడం కాదు..
# ఆచరించడం ముఖ్యం

**అక్టోబర్ 1(జర్నలిస్ట్ వార్త)**
అక్టోబర్ 2 వచ్చిందంటే దేశమంతా మహాత్మా గాంధీని స్మరించుకుంటుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో నివాళులు, విద్యాసంస్థల్లో ప్రసంగాలు, రాజకీయ వేదికలపై గాంధీజీ ప్రస్తావనలు.. ఇలా యథావిధిగా కార్యక్రమాలు సాగుతాయి. కానీ గాంధీ జయంతి అసలు ఉద్దేశం ఇంతటితో ముగిసిపోతుందా? గాంధీ చిత్రపటానికి పూలమాల వేసినంత మాత్రాన ఆయనకు నివాళి అర్పించినట్టేనా? అసలు ప్రశ్న ఇదే.
గాంధీజీ జీవితం మనకు ఒక చారిత్రక ఘట్టం మాత్రమే కాదు.. ఒక నిరంతర ప్రశ్న. సత్యం పట్ల మన నిబద్ధత ఎంత? అహింసను మన ప్రవర్తనలో ఎంతవరకు ఆచరిస్తున్నాం? బలహీనుడి పక్షాన నిలిచే ధైర్యం మనలో ఎంత ఉంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికినప్పుడే గాంధీ జయంతికి నిజమైన అర్థం లభిస్తుంది.
స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీ చేతిలో ఆయుధం లేదు. కానీ సత్యాగ్రహం అనే నైతిక ఆయుధాన్ని ప్రజల చేతుల్లో పెట్టారు. అహింసను బలహీనతగా కాకుండా పోరాట సాధనంగా నిలిపారు. సామాన్యుడిని స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామిని చేశారు. అందుకే గాంధీజీ ప్రభావం ఒక రాజకీయ ఉద్యమానికి మాత్రమే పరిమితం కాలేదు. అది ప్రజల ఆలోచనా విధానాన్ని మార్చిన ఉద్యమంగా మారింది.
నేడు పరిస్థితులు మారాయి. సాంకేతిక పరిజ్ఞానం మన చేతిలో అపారమైన సమాచారాన్ని ఉంచింది. కానీ అదే సమయంలో అబద్ధపు వార్తలు, వదంతులు, ద్వేషపూరిత ప్రచారాలు కూడా అదే వేగంతో వ్యాపిస్తున్నాయి. నిజానిజాలు తెలుసుకునేలోపే ఒక తప్పుడు సమాచారం వేలాది మందికి చేరుతోంది. ఇలాంటి కాలంలో గాంధీజీ చెప్పిన సత్యం మరింత ప్రాసంగికమవుతోంది. మనకు నచ్చిన సమాచారాన్ని నమ్మడం కాదు.. నిజమేమిటో తెలుసుకునే బాధ్యతను స్వీకరించడమే సత్యానికి గౌరవం.
అలాగే అహింసకు కూడా కొత్త అర్థాన్ని వెతకాల్సిన అవసరం ఉంది. హింస అంటే కేవలం శారీరక దాడి కాదు. మాటలతో ఎదుటివారిని




కించపరచడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తులపై ద్వేషాన్ని రెచ్చగొట్టడం, భిన్నాభిప్రాయాన్ని శత్రుత్వంగా చూడడం కూడా సమాజాన్ని హింసాత్మక వాతావరణం వైపు నడిపిస్తాయి. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు తప్పనిసరి. కానీ భిన్నాభిప్రాయాల మధ్య సంభాషణకు చోటు లేకపోతే ప్రజాస్వామ్య స్ఫూర్తి బలహీనపడుతుంది.
గాంధీజీ దృష్టిలో స్వాతంత్ర్యం అంటే కేవలం విదేశీ పాలన నుంచి విముక్తి కాదు. పేదరికం, అసమానత, సామాజిక వివక్ష, అశుచిత్వం వంటి సమస్యల నుంచి కూడా సమాజం విముక్తి పొందాలి. అందుకే గ్రామ స్వరాజ్యం, స్వావలంబన, పరిశుభ్రత, శ్రమకు గౌరవం వంటి అంశాలకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు.

### మహాత్మా గాంధీ సంక్షిప్తంగా

మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించారు. న్యాయవిద్య అభ్యసించి దక్షిణాఫ్రికాలో పనిచేసిన సమయంలో జాతి వివక్షను ప్రత్యక్షంగా ఎదుర్కొన్నారు. అక్కడే సత్యాగ్రహం, అహింసా పోరాట పద్ధతులకు ఆయన రూపకల్పన చేశారు.
1915లో భారతదేశానికి తిరిగి వచ్చిన గాంధీజీ స్వాతంత్ర్యోద్యమంలో కీలక నాయకుడిగా ఎదిగారు. సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి పోరాటాల ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించారు.
గాంధీజీకి స్వాతంత్ర్యం అంటే కేవలం విదేశీ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు. సత్యం, అహింస, సామాజిక సమానత్వం, స్వావలంబన, పరిశుభ్రత, గ్రామ స్వరాజ్యం, మత సామరస్యం కలిగిన సమాజ నిర్మాణం కూడా ఆయన లక్ష్యం.
1948 జనవరి 30న న్యూఢిల్లీలో ఆయన హత్యకు గురయ్యారు. అయితే ఆయన జీవితం, ఆలోచనలు ప్రపంచవ్యాప్తంగా అహింస, పౌర హక్కులు, శాంతియుత పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయి.
గాంధీజీని గుర్తుచేసుకోవడం అంటే ఆయన చిత్రపటానికి పూలమాల వేయడం మాత్రమే కాదు; సత్యం, అహింస, సేవ అనే విలువలను మన జీవితంలో ఆచరించడమే నిజమైన నివాళి.




దేశం ఆర్థికంగా, సాంకేతికంగా ఎంతో ముందుకు వచ్చినా కొన్ని మౌలిక ప్రశ్నలు ఇంకా మన ముందే ఉన్నాయి. అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి చేరుతున్నాయా? గ్రామీణ ప్రాంతాల్లో అవకాశాలు పెరుగుతున్నాయా? పర్యావరణాన్ని కాపాడుకుంటూ అభివృద్ధి సాధిస్తున్నామా? సమాజంలో ప్రతి వ్యక్తికి సమాన గౌరవం లభిస్తున్నదా? గాంధీ ఆలోచనలను ఈ ప్రశ్నల వెలుగులో పరిశీలించాల్సిన అవసరం ఉంది.
గాంధీజీని ఒకే రాజకీయ లేదా సిద్ధాంత పరిధిలో బంధించడం కూడా ఆయన వారసత్వాన్ని చిన్నదిగా చూడటమే. ఆయనతో ఏకీభవించని అంశాలు ఉండవచ్చు. ఆయన ఆలోచనలపై విమర్శలు ఉండవచ్చు. కానీ సత్యం, అహింస, ప్రజాసేవ, నైతిక బాధ్యత, సామాజిక సమానత్వం వంటి విలువలపై జరుగుతున్న చర్చకు ఆయన జీవితం ఇప్పటికీ ఒక ముఖ్యమైన ఆధారం.
అందుకే గాంధీ జయంతి ఒక ఉత్సవం కంటే ఆత్మపరిశీలన దినం కావాలి. పూలమాలలు వేసే చేతులు సమాజానికి ఉపయోగపడే పని చేయాలి. గాంధీని కీర్తించే గొంతులు అసత్యానికి వ్యతిరేకంగా మాట్లాడాలి. అహింస గురించి ప్రసంగించే మనసులు భిన్నాభిప్రాయాలను గౌరవించడం నేర్చుకోవాలి.
గాంధీజీని స్మరించడం సులభం. ఆయన చిత్రాన్ని గోడపై పెట్టడం ఇంకా సులభం. కానీ ఆయన చూపిన విలువలను వ్యక్తిగత జీవితంలో, సామాజిక ప్రవర్తనలో, ప్రజా జీవితంలో ఆచరించడం మాత్రం కష్టం.

**అయితే అదే అసలైన నివాళి.**

గాంధీ జయంతి సందర్భంగా దేశం ఆయనను ఎంతగా స్మరించుకుందన్నది కాదు.. ఆయన చూపిన మార్గంలో మనం ఎంత దూరం నడిచామన్నదే అసలు కొలమానం.

## బయ్యారం ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా వేమిశెట్టి కోటేశ్వరరావు.

### -ప్రధాన కార్యదర్శిగా వేమిశెట్టి సతీష్.-ఘనంగా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం.

**బయ్యారం/,అక్టోబర్ 01.(జర్నలిస్ట్ వార్త)**
ఐక్యమత్యంతోనే ఆర్యవైశ్యుల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తల్లాడ వెంకట రామారావు, ఆర్యవైశ్య మహాసభల రాష్ట్ర కార్యదర్శి నాళ్ళ నరసింహారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వీబీటీ ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైశ్యులందరూ ఒకే తాటిపై నిలిచి సంఘ పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఆర్యవైశ్యులకు సేవాతత్పరులుగా ప్రత్యేక గుర్తింపు ఉందన్న వారు, సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు



సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. అదేవిధంగా వైశ్యులు రాజకీయంగానూ చైతన్యవంతమైన క్రియాశీలక పాత్ర పోషిస్తూ ప్రత్యేక గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నూతన మండల కమిటీతో ముఖ్య నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షులుగా వేమిశెట్టి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేమిశెట్టి సతీష్, కోశాధికారి ఎర్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బోనగిరి బిక్షం, వీరితో పాటు మరో 15 మంది కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేమిశెట్టి కిషోర్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరెల్లి సతీష్, మాజీ అధ్యక్షులు పొద్దుటూరి హనుమంతరావు, వేమిశెట్టి గిరిబాబు, నాగేశ్వరరావు, గరిపెల్లి శ్రీనివాస్, శ్రీను, దామోదర్, నాగేందర్, నరసింహారావు ,ప్రభాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు దుస్తులు, నిత్యావసర సరుకుల పంపిణీ

**ఖమ్మం/అక్టోబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** ఎదులపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండాలో గల మెఫి అనాథ ఆశ్రమంలో రాజేశ్వరి చౌదరి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని 60 మంది అనాథలు, మానసిక వికలాంగుల పిల్లలకు దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన




కార్యక్రమం నిర్వహించారుఈ కార్యక్రమంలో రాజేశ్వరి చౌదరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు నల్లగట్టు ప్రమీల ప్రియాంక మాట్లాడుతూ రాజేశ్వరి చౌదరి తన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయమన్నారు. తన స్నేహితులను సైతం సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడంతో పాటు వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్నారని తెలిపారురాజేశ్వరి చౌదరి, ఆమె కుటుంబ సభ్యులు నిత్యం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు ప్రమీల ప్రియాంక పేర్కొన్నారు

## ప్రశ్న నుంచి పద్మశ్రీ వరకు.. ఓ ఉద్యమ జైత్రయాత్ర

సమాజంలో మార్పు ఎప్పుడూ అధికార గదుల్లో పుట్టదు. ఎక్కడో ఒకచోట అన్యాయాన్ని చూసి ఎందుకు? అని ఒక గొంతు ప్రశ్నించినప్పుడు మార్పు మొదలవుతుంది. ఆ ప్రశ్నకు మరో గొంతు జతకడుతుంది. ఆ తర్వాత వేల గొంతులు ఒక్కటవుతాయి. నినాదంగా మొదలైన ఆ స్వరం ఉద్యమమవుతుంది. కాలాన్ని ఎదురించి నిలిచిన ఉద్యమమే చివరకు చరిత్రను కదిలిస్తుంది. మందకృష్ణ మాదిగ ప్రస్థానం ఇందుకు ఒక సజీవ ఉదాహరణ.
ఒకప్పుడు కొద్దిమందికే వినిపించిన ఎస్సీ ఉపవర్గీకరణ ప్రశ్నను దశాబ్దాల పాటు ప్రజా చర్చలో నిలిపిన ఉద్యమ నాయకుడిగా మందకృష్ణ మాదిగ పేరు ప్రత్యేకంగా నిలిచింది. 1994లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుంచి ఆయన సాగించిన పోరాటం ఒక వ్యక్తి ప్రయాణంగా కాకుండా, సామాజిక న్యాయం కోసం సాగిన దీర్ఘ ఉద్యమంగా రూపుదిద్దుకుంది.
'రిజర్వేషన్ల ఫలాలు అందరికీ సమానంగా అందుతున్నాయా?' 'అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయమైన వాటా దక్కుతోందా?' అనే ప్రశ్నలను ఆయన పదేపదే ప్రజల ముందుంచారు. సమాధానం కోసం ప్రభుత్వాలను నిలదీశారు. పాలకులను ప్రశ్నించారు. ఆందోళనలు నిర్వహించారు. న్యాయస్థానాల తలుపులు తట్టారు. ప్రతికూలతలు ఎదురైనా ఉద్యమ పంథాను విడిచిపెట్టలేదు.

**మూడు దశాబ్దాలు.. ఒకే ప్రశ్న!**



ఇది మాటల్లో చెప్పినంత సులభమైన ప్రయాణం కాదు. ప్రభుత్వాలు మారాయి. పాలకులు మారారు. రాజకీయ సమీకరణాలు మారాయి. ఉద్యమాల రూపాలు మారాయి. ఎస్సీ ఉపవర్గీకరణ డిమాండ్‌ను ప్రజా జీవితంలో సజీవంగా ఉంచడంలో మందకృష్ణ మాదిగ పోషించిన పాత్ర మాత్రం కొనసాగింది.
2024లో సుప్రీంకోర్టు ఎస్సీలలో ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు రాజ్యాంగపరమైన అవకాశం ఉందని తీర్పునివ్వడంతో దశాబ్దాలుగా సాగుతున్న ఈ చర్చకు కీలక మలుపు వచ్చింది. ఒకప్పుడు వీధుల్లో వినిపించిన డిమాండ్ దేశ అత్యున్నత న్యాయస్థానం వరకు చేరడం వెనుక సుదీర్ఘ ప్రజా ఉద్యమం ఉంది. ఆ ఉద్యమంలో మందకృష్ణ మాదిగ పోరాటం ఒక ముఖ్య అధ్యాయం. ఆయన ప్రస్థానాన్ని కేవలం ఉపవర్గీకరణకే పరిమితం చేయలేం. పేద గుండెజబ్బు బాధిత చిన్నారులకు వైద్యసాయం, దివ్యాంగుల హక్కులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల సంక్షేమం వంటి అనేక సామాజిక అంశాలను ఆయన ఉద్యమాల అజెండాలోకి తీసుకొచ్చారు. సమస్య కనిపిస్తే స్పందించడం. బాధితుడి పక్కన నిలవడం.. పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని కదిలించడం. ఈ లక్షణాలు ఆయన ప్రజా ప్రస్థానంలో కనిపిస్తాయి.

**ప్రశ్నించిన గొంతుకు.. పద్మశ్రీ గౌరవం!**

2025లో పబ్లిక్ అఫైర్స్ విభాగంలో పద్మశ్రీ పురస్కారం లభించడం ఆయన సుదీర్ఘ ప్రజా ప్రస్థానానికి జాతీయ స్థాయిలో లభించిన గుర్తింపుగా నిలిచింది. పురస్కారం ఒక వ్యక్తికి దక్కింది. కానీ దాని వెనుక ఉన్న ప్రయాణం మాత్రం వేలాది ఉద్యమకారులది. ఎన్నో నిరసనలు, పోరాటాలు, నిరీక్షణలు, త్యాగాలది. వీధిలో వినిపించిన నినాదం దేశవ్యాప్త చర్చగా మారడం. ఉద్యమం న్యాయస్థానం వరకు వెళ్లడం.. చివరకు జాతీయ గౌరవం దక్కడం. ఇది ఒక ఉద్యమ ప్రయాణంలోని అరుదైన పరిణామం.
పద్మశ్రీతో పోరాటం ముగిసిపోదు. పురస్కారం గౌరవాన్ని పెంచుతుంది. అదే సమయంలో బాధ్యతను కూడా పెంచుతుంది. విద్య, ఉపాధి, వైద్యం, ఆర్థిక అవకాశాలు, సామాజిక గౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు అందే వరకు సామాజిక న్యాయం కోసం ప్రశ్న కొనసాగాల్సిందే.
నాయకుడి గొప్పతనం పదవిలో ఉండదు. ప్రజల బాధను తన బాధగా భావించడంలో ఉంటుంది. గౌరవం పొందడంలో కాదు. గౌరవం లేని వారికి గౌరవం దక్కేలా పోరాడటంలో ఉంటుంది. చప్పట్లలో కాదు. చరిత్రను మార్చేంతకాలం ఒకే ప్రశ్నను పట్టుదలగా వినిపించడంలో ఉంటుంది.
ప్రశ్నతో మొదలైన ప్రస్థానం. పద్మశ్రీతో ఒక మైలురాయిని చేరింది. సామాజిక న్యాయం కోసం ప్రయాణం ఇంకా కొనసాగాల్సిందే. ఆ ప్రయాణానికి ప్రతిధ్వనిగా నిలిచిన పేరు మందకృష్ణ మాదిగ.



**జర్నలిస్ట్ వార్త సి ఈ ఓ ,సీనియర్ జర్నలిస్ట్**
**బిర్రు కరుణాకర్**
**సెల్ నంబర్ 9701249103**

## బయ్యారం పెద్ద చెరువు నుండి లింక్ చెరువులకు నీటి విడుదల.

### -ఎమ్మెల్యే కోరం కనకయ్య.






**బయ్యారం/,అక్టోబర్ 1.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం పెద్ద చెరువు కింద ఉన్న లింక్ చెరువులను నింపేందుకు అధికారులు,సర్పంచ్ లు తూములను గురువారం తెరిచారు.రెండు రోజుల క్రితం రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ ని ఎమ్మెల్యే కోరం కనకయ్య,కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకొని హైదరాబాద్ వెళ్లి బయ్యారం రైతుల సాగునీటి కష్టాలను అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి పెద్ద చెరువు నుండి సాగునీటి విడుదలకు ఆదేశాలు ఇచ్చినట్లు డిఈ నాగార్జున సాగర్ తెలిపారు.ఈ సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్యఅతిథిగా హాజరై పెద్ద చెరువు తూములను ప్రారంభించి నీటిని దిగువకు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లింక్ చెరువులు నిండటం ద్వారా ఆ పరిధిలోని పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందుతుందని తెలిపారు.రైతులు నీటిని పొదుపుగా వాడుకుంటూ పంటలను కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగార్జున సాగర్,మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు,స్థానిక ప్రజాప్రతినిధులు,రైతులు,పాడిపంటల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

RNI NO: TELTEL/2023/87607

# ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్టు విజయాల పరంపర



## పాక్‌పై భారత్ సంచలన విజయం నమోదు

ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్టు తన 10 ఏళ్ల విజయ పరంపరను కొనసాగించింది. ఉత్కంఠభరితమైన సెమీఫైనల్‌లో పాకిస్థాన్‌ను 4-3 తేడాతో ఓడించి భారత హాకీ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది.

భారత విజయంలో కీలక పాత్ర పోషించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేయగా.. సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్ చెరొక గోల్ సాధించారు. స్కోరు 3-3తో సమమైన తర్వాత 60వ నిమిషంలో భారత్ తన చివరి గోల్‌ను నమోదు చేసింది. గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ ఎంతో ఉత్కంఠభరితంగా సాగింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేశాడు. 5వ, 13వ నిమిషాల్లో లభించిన పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచి భారత్‌కు తొలి ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత 23వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ గోల్ చేసి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అనంతరం పాకిస్థాన్ తమ రక్షణ శ్రేణితో గట్టి పోటీ ఇచ్చి పుంజుకోవడానికి ప్రయత్నించింది. 30వ నిమిషంలో అబు మహమూద్, 38వ నిమిషంలో అమ్మాద్ బట్ గోల్స్ చేసి పాకిస్తాన్ జట్టుకు తిరిగి ఆశలు కల్పించారు. మ్యాచ్ చివరి పావుగంటలో, పాకిస్తాన్ స్కోరును సమం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించింది. 45వ నిమిషంలో షాహిద్ హనన్ గోల్ చేసి స్కోరును 3-3తో సమం చేశాడు. మ్యాచ్ చివరి క్షణాల్లో అభిషేక్ అద్భుతమైన పెనాల్టీని సాధించి భారత్‌కు విజయాన్ని ఖాయం చేశాడు.

# 148 ఏళ్ల క్రికెట్ చరిత్రలోనే ఇదే తొలిసారి..!



క్రికెట్ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని రికార్డ్‌ను టీమిండియా సొంతం చేసుకుంది. తొలి 30 ఓవర్లలోనే 300 పరుగులు చేసిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో గౌహతి వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్‌లో 406 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన భారత్.. శుభ్‌మన్ గిల్(130 బంతుల్లో 25 ఫోర్లు, 8 సిక్స్‌లతో 217 నాటౌట్), రోహిత్ శర్మ(75 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 101) విధ్వంసకర బ్యాటింగ్‌తో 29.1 ఓవర్లలోనే 300 పరుగులు చేసింది. మరో 39 బంతులు మిగిలి ఉండగానే ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించి రికార్డ్ విజయాన్ని అందుకుంది. క్రికెట్ చరిత్రలోనే మరే జట్టు కూడా 30 ఓవర్లలోపు 300 పరుగులు చేయలేదు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడటంతో ఈ రికార్డ్ సాధ్యమైంది. 10 ఓవర్లలోనే 92పరుగులు చేసిన ఈ జోడీ.. 21.1 ఓవర్లలో 200 పరుగుల మైలురాయిని అందుకుంది. వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా 200 పరుగులు చేసిన జట్టుగానూ భారత్ నిలిచింది. తొలి వికెట్‌కు 255 పరుగులు జోడించిన అనంతరం రోహిత్ శర్మ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగినా.. క్రీజులోకి వచ్చిన కోహ్లీ దూకుడుగా ఆడాడు. శుభ్‌మన్ గిల్ కూడా బౌండరీల మోత మోగించడంతో భారత్ 29.1 ఓవర్లలోనే (175 బంతుల్లో) 300 పరుగులు చేసి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. గతంలో సౌతాఫ్రికా మాత్రమే 32.2 ఓవర్లలో 300 పరుగులు చేసింది. 2006లో జోహన్నెస్‌బర్గ్‌లో ఆస్ట్రేలియాపై ఈ ఫీట్ సాధించింది. 2006లో శ్రీలంకపై ఇంగ్లండ్ 33.1 ఓవర్లలో, 2009లో శ్రీలంకపై భారత్ 34.1 ఓవర్లలో 300 పరుగులు చేశాయి. ఈ పాత రికార్డ్‌లన్నింటిని తాజాగా భారత్ బద్దలుకొట్టింది. 30 ఓవర్లలోపే 300 పరుగులు సాధించిన తొలి జట్టుగా చరిత్రకెక్కింది. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. నామమాత్రపు ఆఖరి వన్డే శనివారం న్యూ చండీఘడ్ వేదికగా జరగనుంది.

# భారత్ తరఫున ఆడటం వేరే ఫీలింగ్!

## • వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్

ఆసియా క్రీడల్లో భారత్ తరఫున ఆడటం.. అందులోనూ పతకం కోసం పోరాడటం చాలా ప్రత్యేకమైన అనుభూతినిస్తుందని వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అన్నాడు. సాధారణ అంతర్జాతీయ మ్యాచ్‌లతో పోలిస్తే ఆసియా క్రీడల్లో కొంత ఎక్కువ ఒత్తిడి ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్లో ఇషాన్ కిషన్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. 80 పరుగులతో రాణించి భారత్ 169 పరుగులు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం భారత బౌలర్లు శ్రీలంకను కేవలం 45 పరుగులకే ఆలౌట్ చేయడంతో భారత్ ఘన విజయం సాధించింది. "భారత్ కోసం ఆడుతున్నప్పుడు.. ముఖ్యంగా పతకం కోసం ఆడుతున్నప్పుడు మనసులో ఏదో ప్రత్యేకమైన భావన ఉంటుంది. ఇక్కడ బీసీసీఐ కోసం కాదు.. మొత్తం దేశం కోసం ఆడుతున్నామనే ఫీలింగ్ వస్తుంది. చుట్టూ భారత జెండాలు కనిపించడం, అభిమానులు పెద్ద సంఖ్యలో మద్దతు ఇవ్వడం ఆ అనుభూతిని మరింత పెంచుతుంది. బయటకు చూపించకపోయినా లోపల మాత్రం కొంత ఎక్కువ ఒత్తిడి ఉంటుంది" అని ఇషాన్ చెప్పాడు. పగుళ్లు కనిపించే పిచ్‌పై బ్యాటింగ్ చేయడం అంత సులభం కాదని ఇషాన్ తెలిపాడు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం 150 పరుగులు చేస్తే సురక్షితంగా ఉంటామని ముందే అంచనా వేసినట్లు చెప్పాడు. ఒక బ్యాటర్ క్రీజులో కుదురుకుంటే చివరి వరకు ఉండి భారీ స్కోరు చేయాలన్నది జట్టు ప్రణాళికగా ఉందని వివరించాడు. "ఇలాంటి పిచ్‌లపై వ్యక్తిగత లక్ష్యాల కంటే జట్టు అవసరాలే ముఖ్యం. పరిస్థితిని గమనిస్తూ చిన్న చిన్న విషయాలపై దృష్టి పెట్టాలి" అని పేర్కొన్నాడు. ఇక శనివారం పాకిస్థాన్‌తో జరగనున్న స్వర్ణ పతక పోరుపై కూడా ఇషాన్ స్పందించాడు. మ్యాచ్ గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండాలని, ఆ క్షణాలను ఆస్వాదిస్తూ ఆడాలని జట్టు భావిస్తోందన్నాడు. జపాన్‌లో లభించిన ఆతిథ్యంపై ఇషాన్ ప్రశంసలు కురిపించాడు. భాష సమస్య ఉన్నప్పటికీ స్థానికులు ఎంతో సహాయం చేశారని చెప్పాడు. భారత అభిమానులు ఎక్కడికి వెళ్లినా మద్దతుగా నిలుస్తున్నారన్నారు. గెలిచినా ఓడినా తమకు అండగా ఉంటున్న అభిమానులకు ఎప్పటికీ కృతజ్ఞతలు చెబుతామని అన్నాడు.



# లంకను గెలిచిన భారతం



## 45 పరుగులకే శ్రీలంక ఆలౌట్..

## 124 పరుగుల తేడాతో భరత్ విక్టరీ

## విధ్వంసం సృష్టించిన ఇషాన్ కిషన్

2026 ఆసియా క్రీడల రెండో క్రికెట్ సెమీ-ఫైనల్ పూర్తిగా ఏకపక్షంగా సాగింది. ఈ టోర్నీలో తొలిసారిగా అడుగుపెట్టిన భారత్.. వర్షం వచ్చినప్పుడల్లా భారత్‌ను ఎందుకు ఛాంపియన్‌గా పరిగణిస్తారో నిరూపించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 169 పరుగులు చేసింది. ఆ తర్వాత 9.5 ఓవర్లలో శ్రీలంకను 45 పరుగులకే ఆలౌట్ చేసి.. 124 పరుగుల తేడాతో మ్యాచ్‌ను గెలుచుకుంది. ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున అభిషేక్ శర్మ మోస్ట్ సక్సెస్‌ఫుల్ బౌలర్‌గా నిలిచాడు. అభిషేక్ శర్మ కేవలం 5 బంతుల్లో 2 పరుగులకే 2 వికెట్లు పడగొట్టాడు. అభిషేక్ శర్మ ఓవర్‌లోని చివరి మూడు బంతులకు శ్రీలంక వికెట్లు కోల్పోయింది. తొమ్మిది ఓవర్ల తర్వాత శ్రీలంక స్కోరు 43-7గా ఉండగా.. ఆ తర్వాతి ఐదు బంతుల్లో అభిషేక్ శర్మ బౌలింగ్ భారత్‌కు విజయాన్ని ఖాయం చేసింది. జపాన్‌లో నిషిన్ నగరంలోని కొరోగి స్పోర్ట్స్ పార్క్ స్టేడియం వేదికగా శ్రీలంక జట్టుతో జరుగుతున్న ఆసియా క్రీడల సెమీ-ఫైనల్ మ్యాచ్ లో భారత్ అద్భుతంగా రాణించింది. క్లిష్టమైన పిచ్ పై భారత్ అద్భుతంగా పోరాడి భారీ లక్ష్యాన్ని నమోదు చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. శ్రీలంక ముందు 170 పరుగు భారీ లక్ష్యాన్ని ఉంచింది. టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న శ్రీలంకకు ఆరంభంలోనే అద్భుతమైన ప్రారంభం లభించింది. మొదటి 3 ఓవర్లలోనే అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లను వరుసగా పెవిలియన్ పంపి టీమిండియాను దెబ్బతీసింది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే భారత్ తడబడుతున్న సమయంలో యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ భయపడకుండా కౌంటర్ ఎటాక్ ప్రారంభించాడు. కేవలం 21 బంతుల్లో 38 పరుగులు సాధించి ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. వైభవ్ సూర్యవంశీ దాడితో భారత్ పవర్‌ప్లే ముగిసేసరికి 58/2 స్కోరుతో బలమైన స్థితిలో నిలిచింది. అయితే మిడిల్ ఓవర్లలో శ్రీలంక స్పిన్నర్లు మ్యాచ్ ను మళ్లీ తమ వైపు తిప్పుకున్నారు. సహన్ అరచ్చిగే బౌలింగ్‌లో వైభవ్ సూర్యవంశీ ఔట్ కాగా.. వనుజ సహన్ బౌలింగ్‌లో శ్రేయస్ అయ్యర్ (13) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. లంక స్పిన్నర్లు పకడ్బందీ బౌలింగ్‌తో రన్ రేట్‌ను కట్టడి చేస్తూ వరుస వికెట్లు పడగొట్టారు. అక్షర్ పటేల్, తిలక్ వర్మ, శివమ్ దూబే తక్కువ స్కోర్లకే నిష్క్రమించడంతో భారత్ ఒకానొక దశలో 151/7తో కష్టాల్లో పడింది. ఓ వైపు వరుసగా వికెట్లు పడుతున్నప్పటికీ ఇషాన్ కిషన్ ఒంటరి పోరాటం చేస్తూ ఇన్నింగ్స్ ను నిలబెట్టాడు. ఆరంభంలో నిలకడగా ఆడిన ఇషాన్ కిషన్.. డెత్ ఓవర్లలో చెలరేగిపోయి 46 బంతుల్లో 80 పరుగులు సాధించాడు. చివరిలో వాషింగ్టన్ సుందర్ మెరుపు కామియో జోడించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. శ్రీలంక ఫైనల్ టికెట్ ఖాయం చేసుకోవాలంటే 170 పరుగులు చేయాల్సి ఉంది. పిచ్ స్పిన్ కు అనుకూలిస్తుండటంతో ఈ ఛేజింగ్ చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగనుంది. మ్యాచ్‌లో భారీ స్కోరు చేయడం ద్వారా భారత్ తన విజయాన్ని దాదాపు ఖాయం చేసుకుంది. ఆ తర్వాత, జస్ప్రీత్ బుమ్రా తొలి ఓవర్‌లోనే 2 వికెట్లు తీసి భారత్ విజయాన్ని దాదాపు ఖాయం చేశాడు. ఆ తర్వాత శ్రీలంక జట్టు పేకముక్కల్లా కూలిపోయి 45 పరుగులకే ఆలౌట్ అయింది. 124 పరుగుల తేడాతో గెలిచి భారత్ రికార్డు కూడా సృష్టించింది. ఫైనల్‌లో భారత్ పాకిస్తాన్‌తో తలపడను ంది. సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించి పాకిస్థాన్ ఫైనల్‌కు చేరుకుంది. అయితే ఆసియాలో ఏ జట్టు కూడా భారత జట్టుకు సవాలు విసరలేకపోతోంది. అందువల్ల భారత్ స్వర్ణ పతకం విజయం ఖాయంగా భావిస్తున్నారు.

# ప్రపంచకప్ కంటే గోల్డ్ మెడల్ గొప్పది



ఆసియా గేమ్స్ 2026లో బంగారు పతకం గెలవడం చాలా ప్రత్యేకమైన అనుభవమని, ప్రపంచకప్ కంటే గొప్ప విజయమని టీమిండియా ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ అన్నాడు. ఆసియా గేమ్స్ 2026లో భారత్ పురుషుల క్రికెట్ టీమ్ ఫైనల్‌కు దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. గురువారం శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్లో భారత్ 124 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. శనివారం జరిగే ఫైనల్లో పాకిస్థాన్‌తో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. సెమీఫైనల్ విజయానంతరం బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన అక్షర్ పటేల్..తన అనుభవాలను పంచుకున్నాడు. గేమ్ విలేజ్‌లో ఉండటం ప్రత్యేక అనుభూతినిస్తోందని చెప్పాడు. 'ఏ జట్టు అయినా గెలవాలంటే గట్టిగా ప్రయత్నించాలి. మేం చేయాల్సింది మేం చేశాం. అయితే ఈ మ్యాచ్ ఆడేందుకు చాలా రోజులు ఎదురుచూడాల్సి వచ్చింది. వర్షం పడటం వల్ల మ్యాచ్‌లు జరగలేదు. సుదీర్ఘ విరామం తర్వాత మ్యాచ్ జరిగినప్పటికీ జట్టులోని ప్రతీ ఒక్కరూ అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ మ్యాచ్‌లు కూడా ఇదే పిచ్‌పై జరిగాయి. ఆ మ్యాచ్‌లు చూశాక ఈ వికెట్‌పై 140-150 పరుగులు చేస్తే గెలిచే అవకాశం ఉంటుందని అంచనా వేశాం. కానీ మేం అదనంగా(169) 10-15 పరుగులు ఎక్కువే చేశాం. మ్యాచ్ ఆరంభంలో బంతికి డ్రిఫ్ట్, టర్న్, బౌన్స్ బాగా లభించాయి. పాకిస్థాన్‌తో జరిగే ఫైనల్ మ్యాచ్ ఏ వికెట్‌పై ఆడిస్తారనే దానిపై ప్రస్తుతం మాకూ సమాచారం లేదు. దీని గురించి మాట్లాడాం కానీ ఇంకా ఖరారు కాలేదని చెప్పారు. అయితే ఇక్కడి మైదానంలో మూడు వికెట్లు ఉన్నాయి. మూడూ దాదాపు ఒకేలా పగుళ్లతో కనిపిస్తున్నాయి. కాబట్టి ఏ వికెట్‌పై ఆడినా పిచ్ ప్రవర్తనలో ఎలాంటి తేడా ఉండే అవకాశం లేదు. ఇక్కడి భారతీయ రెస్టారెంట్ల నుంచి పార్సిల్ తెప్పించుకొని తింటున్నాం. తిండి విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు. ఇక్కడ మూడు, నాలుగు ఇండియన్ రెస్టారెంట్లు ఉన్నాయి. వాళ్ల ఫుడ్ బాగా వండుతున్నారు. జపాన్‌లో క్రికెట్ ఎక్కువగా ఆడరన్న విషయం తెలిసిందే. కానీ వాళ్ళు చేస్తున్న కృషి మాత్రం అద్భుతం. మైదానంతో పాటు వాతావరణం విషయంలో వాళ్ళ పరిమితుల మేరకు మంచి ఏర్పాట్లు చేశారు. రాబోయే రోజుల్లో క్రికెట్ సౌకర్యాలను మరింత పెంచి, ఇంకా మంచి పరిస్థితులు కల్పిస్తారని ఆశిస్తున్నా. నేను గేమ్స్ విలేజ్‌లో ఉండటం ఇదే తొలిసారి. ఈ అనుభవం చాలా బాగుంది. గతంలో మేం ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ లేదా ఇతర దేశాలకు వెళ్లినప్పటి అనుభవాలకు ఇక్కడికి చాలా తేడా ఉంది. కానీ ఏషియన్ గేమ్స్‌లో ఇతర క్రీడాకారులతో కలిసి ఉండటం ఒక కొత్త అనుభూతినిస్తోంది. ఇక్కడున్న ప్రతీ ఒక్కరికీ ఐడీ కార్డులు ఇచ్చారు. ఆ ఐడీ కార్డు వేసుకుని బయట నడుస్తున్నప్పుడు జనాలు మమ్మల్ని చూసే విధానం చాలా భిన్నంగా ఉంటుంది. అథ్లెట్లు అని జనాలు గుర్తించి ప్రత్యేకంగా చూస్తుంటారు. ఇది నాకు చాలా సంతోషాన్నిస్తోంది. గోల్డ్ మెడల్ గెలవడం అనేది ప్రత్యేకమైన అనుభవం. మేం గతంలో ప్రపంచకప్, ఇతర పెద్ద టోర్నీలు గెలిచాం. అక్కడ బీసీసీఐ తరఫున దేశం కోసం ఆడుతాం. కానీ ఆసియా గేమ్స్‌లో పరిస్థితులు వేరు. ఇక్కడ నేరుగా దేశం తరఫున ఆడి స్వర్ణం సాధించే అవకాశం లభిస్తుంది. నా దృష్టిలో ప్రపంచకప్ కంటే ఇది చాలా ముఖ్యమైనది. మా ఆట తీరు చూస్తుంటే స్వర్ణం గెలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒకవేళ స్వర్ణం గెలిస్తే.. అది నాకు చాలా గర్వకారణమైన క్షణం అవుతుంది.'అని అక్షర్ పటేల్ చెప్పుకొచ్చాడు.



# ఇంత భిన్నమైన అభిప్రాయాలు వస్తాయని ఊహించలేదు..

## 'ది ప్యారడైజ్' రిజల్ట్‌పై నాని

నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన 'ది ప్యారడైజ్'కు ప్రేక్షకుల నుంచి భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. సినిమా నచ్చిందని కొందరు చెబుతుండగా.. మరికొందరు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాని స్పందించారు. తన 18 ఏళ్ల కెరీర్‌లో 33 సినిమాలు చేసినా.. ఇలాంటి భిన్నమైన స్పందనను తొలిసారి చూస్తున్నానని చెప్పారు.సినిమాపై విమర్శలు వచ్చినా వాటిలో కనిపిస్తున్న తీవ్రతను తాము సానుకూలంగానే తీసుకున్నామని నాని తెలిపారు. సినిమా నచ్చలేదని ఎవరైనా బలంగా చెబితే.. అది కూడా ప్రేక్షకుల స్పందనేనని పేర్కొన్నారు.'ది ప్యారడైజ్'కు తీవ్ర స్థాయిలో స్పందనలు రావొచ్చని ముందే తెలుసని నాని చెప్పారు. అయితే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంత భిన్నమైన అభిప్రాయాలు వస్తాయని ఊహించలేదన్నారు. ఇది తనకు ఒక కొత్త అనుభవమని చెప్పారు.మరోవైపు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కూడా స్పందించారు. సినిమాకు వస్తున్న మిశ్రమ స్పందనను ఇంకా పూర్తిగా అర్థం చేసుకోలేకపోతున్నానని తెలిపారు. మరికొంత సమయం తీసుకుని ప్రేక్షకుల స్పందనను అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు.

ఇదే విషయంపై నాని, సినిమా విడుదలైన మరుసటి రోజే సోషల్ మీడియాలో స్పందించారు. ప్రేక్షకుల ప్రేమతో పాటు, ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నానని చెప్పారు. సినిమా బాగోలేదని విమర్శకులు చెప్పిన అంశాల నుంచి కూడా నేర్చుకున్నానని తెలిపారు. ప్రేక్షకుల కోసం ఎంతో కష్టపడి ప్రత్యేకమైన అనుభవాన్ని అందించేందుకు సినిమా చేశామని పేర్కొన్నారు.సెప్టెంబర్ 24న విడుదలైన 'ది ప్యారడైజ్'లో మోహన్ బాబు, కయాదు లోహర్, రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో నటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరిపోయింది.



## సరిగమ వాదనతో ఏకీభవించిన సుప్రీంకోర్టు..

# ఇళయరాజాకు ఎదురుదెబ్బ

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాల నాటి 'ఎన్ ఇనియ పొన్ నిలవే' పాట కాపీరైట్ హక్కుల వివాదంలో ఆయన దాఖలు చేసిన అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.జస్టిస్ జె.బి. పర్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. 1980 నాటి తమిళ చిత్రం 'మూడు పానీ'లోని ఈ పాట ట్యూన్‌కు (సంగీతానికి) మాత్రమే ఇళయరాజాకు హక్కులు ఉంటాయని... పాట సాహిత్యం, సౌండ్ రికార్డింగ్‌పై ఆయనకు ఎలాంటి హక్కులు ఉండవని కోర్టు తేల్చిచెప్పింది.

సినిమా నిర్మాత నుంచి సౌండ్ రికార్డింగ్ హక్కులను పొందిన మ్యూజిక్ లేబుల్ 'సరిగమ'కు అనుకూలంగా ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. 'అగతియా' అనే మరో సినిమాలో ఈ పాటను రీక్రియేట్ చేయడంతో ఈ వివాదం మొదలైంది. తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ఈ కేసులో సరిగమ సంస్థకు పూర్తిస్థాయిలో న్యాయపరమైన ఉపశమనం లభించినట్లయింది.

# షూటింగ్‌లో జారిపడ్డ బిగ్ బీ.. మోకాలికి దెబ్బ



బాలీవుడ్ సీనియర్ నటుడు అమితాబ్ బచ్చన్ గాయపడ్డారు. ఆయన హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ప్రముఖ టెలివిజన్ రియాలిటీ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' (కేబీసీ) సెట్‌లో ఈ ఘటన జరిగింది. షూటింగ్‌లో భాగంగా నడుస్తుండగా ఆయన ప్రమాదవశాత్తు జారిపడటంతో మోకాలికి గాయమైంది. ఈ విషయాన్ని అమితాబ్ స్వయంగా షోలోనే వెల్లడించారు.కేబీసీ తాజా ఎపిసోడ్ ప్రారంభంలో ఈ సంఘటన గురించి బిగ్ బీ ప్రేక్షకులకు తెలిపారు. సాధారణంగా షో ప్రారంభంలో నిల్చొని మాట్లాడే ఆయన, ఈసారి మాత్రం కూర్చునే కనిపించారు. దీనికి కారణం వివరిస్తూ, "నిన్న షూటింగ్ సమయంలో జారిపడటంతో నా ఎడమ మోకాలికి గాయమైంది. అందుకే నిలబడటంలో కొద్దిగా ఇబ్బందిగా ఉంది" అని చెప్పారు. దీంతో సెట్‌లోని సిబ్బంది, అక్కడున్న వైద్యులు వెంటనే స్పందించి ఆయనకు చికిత్స అందించారు.

అయితే, గాయం తీవ్రమైనదేమీ కాదని, కంటెస్టెంట్ల కోసం తాను తప్పకుండా నిలబడతానని అమితాబ్ ప్రేక్షకులకు భరోసా ఇచ్చారు. ఈ వయసులో కూడా ఆయన ఎంతో చురుకుగా షూటింగ్‌లో పాల్గొంటుండగా ఈ ప్రమాదం జరగడంతో అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా బిగ్ బీ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ పోస్టులు పెడుతున్నారు.

# సాంప్రదాయం, చిలిపిదనం కలిస్తే మమితా బైజు..

మలయాళీ ముద్దుగుమ్మ మమితా బైజు తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో .. అద్భుతమైన నటనతో యూత్‌లో విపరీతమైన ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. -ప్రేమలు- సినిమాతో ఒక్కసారిగా టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా అన్ని సినీ పరిశ్రమల్లోనూ క్రేజీ హీరోయిన్‌గా మారిపోయింది. ఈ బ్యూటీ సోషల్ మీడియాలో ఏ చిన్న పోస్ట్ పెట్టినా క్షణాల్లో వైరల్ అవుతుండటం విశేషం. తాజాగా మమితా బైజు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని కొత్త ఫోటోలు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. --విస్పర్స్ ఆఫ్ సిల్క్ అండ్ లైట్-- అనే క్యాప్షన్‌తో ఈ బ్యూటీ షేర్ చేసిన ఈ అందమైన ఫోటోలు అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయ సిల్క్ దుస్తుల్లో దేవకన్యలా మెరుస్తున్న తన గ్లామర్, క్యూట్ స్మైల్ నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి. ఈ ట్రెండీ లుక్ వెనుక పెద్ద టీమ్ శ్రమ ఉంది. ప్రముఖ డిజైనర్ దీప్తి అందించిన అవుట్‌ఫిట్ ధరించగా.. అర్చన అఖిల్ రావు స్టైలింగ్ చేశారు. కర్ణిక జ్యువెల్స్ వారి ఆభరణాలు.. ఫోటోగ్రాఫర్ విష్ణు అందించిన అద్భుతమైన కెమెరా యాంగిల్స్ ఈ ఫొటోషూట్‌ను మరింత హైలైట్ చేశాయి. ఇక హెయిర్ అండ్ మేకప్ అందించిన టీమ్ సహకారంతో మమితా రూపం మరింత కళకళలాడుతోంది. ట్రెడిషన్ ప్లస్ అందం అంటూ ఈ లుక్ పై ప్రశంసలు కురుస్తున్నాయి. ఫోటోలు పోస్ట్ చేసిన క్షణాల వ్యవధిలోనే లైకులు, కామెంట్ల వర్షం కురుస్తోంది. అభిమానులు ఈ బ్యూటీని -నేషనల్ క్రష్- అని, -మాతా పితా మమిత- అంటూ రకరకాల కామెంట్లతో అభినందిస్తున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో లనా డెల్ రే పాటను జోడించడం కూడా ఈ పోస్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని ఫ్యాన్స్ మురిసిపోతున్నారు. మొత్తానికి మమితా బైజు తాజా లుక్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.



# వెంకీ 'ఆదర్శ కుటుంబం'.. అక్టోబర్ 6న ట్రైలర్ విడుదల



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌పై ఉన్న ఆసక్తిని మరింత పెంచుతూ చిత్రబృందం వరుస అప్‌డేట్స్‌తో ముందుకొస్తోంది. సినిమా విడుదల తేదీ అక్టోబర్ 9 సమీపిస్తుండటంతో ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. తాజాగా నిర్మాత నాగవంశీ ఈ సినిమా ట్రైలర్ విడుదల, టికెట్ బుకింగ్స్‌కు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు.నాగవంశీ తెలిపిన వివరాల ప్రకారం.. 'ఆదర్శ కుటుంబం' థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 6వ తేదీన విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు పెరగ్గా, ట్రైలర్‌తో కథాంశం, పాత్రల తీరుతెన్నులపై పూర్తి స్పష్టత రానుంది. ముఖ్యంగా తొలిసారి వెంకటేశ్‌ను త్రివిక్రమ్ ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ట్రైలర్ విడుదలైన మరుసటి రోజే, అంటే అక్టోబర్ 7 నుంచి తెలుగు రాష్ట్రాల్లో టికెట్ బుకింగ్స్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో అభిమానులు, ప్రేక్షకులు సినిమా విడుదలకు రెండు రోజుల ముందే తమ టికెట్లను రిజర్వ్ చేసుకునే అవకాశం కలుగుతుంది.ఈ సందర్భంగా నాగవంశీ మాట్లాడుతూ.. 'ఆదర్శ కుటుంబం' ఒక సంపూర్ణ కుటుంబ కథా చిత్రమని, కామెడీ, యాక్షన్, భావోద్వేగాల కలబోతగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. "పిల్లల పరీక్షలు పూర్తయ్యాక, కుటుంబమంతా కలిసి థియేటర్‌కు వచ్చి హాయిగా నవ్వుకునే సినిమా ఇది. ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని ఆస్వాదిస్తారు" అని ఆయన పేర్కొన్నారు. త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, ఆయన శైలి మేకింగ్‌కు వెంకటేశ్ ఎనర్జీ, టైమింగ్ తోడైతే వినోదం ఏ స్థాయిలో ఉంటుందోనని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నివేదా పేతురాజ్, నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేశ్, సత్య, యువినా పార్తవి వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబర్ 9న థియేటర్లలోకి రానున్న ఈ సినిమాపై తాజా అప్‌డేట్స్‌తో అంచనాలు మరింతగా పెరిగాయి.

# అక్టోబర్ 30న 'క్రేజీ కల్యాణం'..

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తెలుగు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం' విడుదల తేదీ ఖరారైంది. బద్రప్ప గజులా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ ఆరో సినిమాస్ బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా సినిమాలోని రెండో పాట 'అలసెంద్రవంకోలే ఉన్నావే పిల్ల' ప్రోమోను విడుదల చేసింది.



ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. కీర్తి పాత్రలో అనుపమ పరమేశ్వరన్ కనిపించనుండగా, ఆమె తండ్రి పాత్రను డాక్టర్ నరేశ్ పోషించారు. కూతురి పెళ్లిని ఘనంగా చేయాలని ఆశపడే తండ్రి చుట్టూ టీజర్‌లోని కథ సాగుతుంది. కూతురికి ఎంత బంగారం కావాలన్నా కొనిస్తానని, నచ్చినన్ని చీరలు తీసుకోవచ్చని, స్నేహితులందరినీ పెళ్లికి పిలవొచ్చని ఆయన చెబుతారు.తన కూతురికి మంచి సంబంధం చూడాలనే ప్రయత్నంలో సోదరుడితోనే ఆయన గొడవకు దిగుతారు. అయితే కీర్తికి మాత్రం తనదైన ఆలోచనలు ఉంటాయి. తన తండ్రిలాగే తాను కూడా మొండిదాన్నేనని అమ్మమ్మతో చెప్పే సన్నివేశం టీజర్‌లో నవ్వులు పూయిస్తుంది. దేవుడిని ప్రార్థిస్తూ తన పెద్ద అల్లుడి కంటే పేదవాడైన మరో అల్లుడు తన సోదరుడికి దొరకాలని నరేశ్ కోరుకునే సన్నివేశం కూడా వినోదాన్ని పంచుతుంది. చివర్లో కీర్తి ఓ వ్యక్తిపై ఎండుమిరపకాయలు విసరడం, ఆమెను పెళ్లి చేసుకునేవాడి పని అయిపోయినట్టేనని అతడు అనడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.బద్రప్ప గజులా ఈ సినిమాతో దర్శకుడిగా తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. అనుపమతో పాటు అఖిల్ రాజ్ ఉద్దేమరి, డాక్టర్ నరేశ్ విజయకృష్ణ, తరుణ్ భాస్కర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్యామ్ దుపాటి ఛాయాగ్రహణం అందిస్తుండగా, సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూరుస్తున్నారు. కథ, దర్శకత్వ బాధ్యతలు బద్రప్ప గజులా నిర్వహించగా, శ్రీనివాస రవీంద్ర స్క్రీన్‌ప్లే అందించారు.